


తిమ్మాపూర్‌లో భారీగా కురుస్తున్న వర్షం



దంచికొట్టిన వాన

నేల వాలిన వరి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 24: జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. జిల్లా కేంద్రంలో దాదాపు అరగంటకుపైగా భారీ వర్షం కురిసింది. తిమ్మాపూర్, మానకొండూర్, హుజూరాబాద్ తదితర మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా జమ్మికుంటలో అత్యధికంగా 49.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జమ్మికుంట మండలం కొత్తపల్లి-. ద ర్మారంలో 47, వీణవంక మండల కేంద్రంలో 40.3, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో 34.5, కరీంనగర్‌లో 34.3, శంకరపట్నం మండలం తాడికల్‌లో 32.8, చిగురుమామిడి మండల కేంద్రంలో 30, మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లిలో 22, ఇల్లందకుంట మండలం మల్యాలలో 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

● **వీణవంక:** మండలంలో కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. మండలంలోని వల్భాపూర్, నర్సింగాపూర్, కనపర్తి, ఎల్బాక గ్రామాల్లో చేతికొచ్చె సమయానికి పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు తెలిపారు. వంద ఎకారలకు పైగా వరి పంట దెబ్బతిన్నది. ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి వర్షానికి తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పిడుగుపాటుతో రైతు మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన కంకణాల కృష్ణకుమార్ (30) అనే రైతు మంగళవారం పిడుగుపాటుతో మృతి చెందాడు. కృష్ణకుమార్ తన పాడి గేదెలను మేపేందుకు మధ్యాహ్నం గ్రామ శివారులోని మైదానంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో వర్షం మొదలై పిడుగుపడింది. దీంతో కృష్ణకుమార్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కృష్ణకుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

● **శంకరపట్నం:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ముత్తారం, కన్నాపూర్, ధర్మారం, రాజాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో అక్కడక్కడ కోత దశలో ఉన్న వరి పంట నేల వాలింది. పంట చేతికందే సమయంలో నోటికి అందకుండా నేలపాలైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు ఇలానే కొనసాగితే నెలకొరిగిన వరి పంటకు మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముత్తారంలో కౌలు రైతు బొంగోని శ్రీనివాస్ మూడెకరాల్లో వరి పంట సాగు చేశాడు. ట్రాక్ మిషన్ తెప్పించుకొని వరి కోస్తుండగా ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో వరి పంట నేల వాలింది. దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **తిమ్మాపూర్:** మండలంలోని మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నుండి నీరు వరదల ప్రవహించాయి. ఎల్ఎండీలోని ఇరిగేషన్ కార్యాలయలు, పే అండ్ అకౌట్స్ కార్యాలయం ఎదుట భారీగా వర్షం నీరు నిలిచింది.

● చిగురుమామిడి మండలంలో రెండు పశువులు

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి, లంబాడిపల్లిలో పిడుగుపాటుకు రెండు పశవులు మృతి చెందినట్లు అర్ఐ అరుణ్ తెలిపారు. ఉల్లంపల్లికి చేందిన కానవేని సారవ్వకు చెందిన దాదాపు 80 వేల పాడి ఆవు, లంబాడిపల్లికి చెందిన నాగెల్లి వీరారెడ్డికి చెందిన 50 వేల విలువ గల ఎద్దు మృతి చెందిందన్నారు. సంబంధత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా చేసినట్లు ఆయన తెలిపారు.



ముత్తారంలో నేలవాలిన వరి పంటను చూపిస్తున్న కౌలు రైతు శ్రీనివాస్



వీణవంక మండలం వల్భాపూర్‌లో వర్షానికి నేలకొరిగిన వరి పంట

నేటి నుంచి వయో వృద్ధుల వారోత్సవాలు

కరీంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో బుధవారం నుంచి వయో వృద్ధుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి ఒకప్రటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వయో వృద్ధులకు అవగాహన సదస్సులు, వసతి గృహాల్లోని వృద్ధులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వయో వృద్ధులకు ఉన్న హక్కులపై అవగాహన కోసం వాక్‌థాన్, హెల్ప్‌లైన్‌పై గ్రామ స్థాయి అధికారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, వారి అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతలతో గ్రాండ్ పేరెంట్స్ డే, అక్టోబరు 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తామన్నారు.

'పోలింగ్ కేంద్రాల లొకేషన్లను పరిశీలించాలి'

కరీంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హేతుబద్ధీకరణలో భాగంగా బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల లొకేషన్లను పరిశీలించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలన, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై పలు సూచనలు చేశారు. ఫారం 6, 7, 8ను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల ప్రింటింగ్‌కు మూడు జిల్లాల నుంచి మాత్రమే వివరాలు వచ్చాయని తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభందించి ఈ నెల 30న పబ్లిక్ నోటీస్ జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు నీటికి ఇబ్బంది కలగకుండా చూడాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, సెప్టెంబరు 24: గ్రామీణ ప్రాంతాల్లో నివాసించే ప్రజలకు ఎలాంటి నీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని మహాత్మానగర్ మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో లేకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంపులు, మోటర్లు పాడైతే వెంటనే మరమతులు చేయాలన్నారు. నీటిని శుభ్రంగా అందించాలని, క్లోరినేషన్ చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. కార్యక్రమంలో డీటీసీ పురుషోత్తం, డీపీవో రవీందర్, మిషన్ భగీరథ ఎస్ఈ కె రాములు, ఈఈ అంజన్‌రావు పాల్గొన్నారు.

● మండలంలోని ఎల్ఎండిలో గల క్యాంప్ కార్యలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, ఎల్కపల్లి సంపత్, ఆశిక్ పాషా, రాములు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూరాబాద్, సెప్టెంబరు 24: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్-17 బాలుర విభాగంలో మొదటి స్థానంలో హుజూరాబాద్, రెండో స్థానంలో చొప్పదండి నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కరీంనగర్ అర్బన్, రెండో స్థానంలో సైదాపూర్ నిలిచాయి. అండర్-14 బాలుర విభాగంలో మొదటి స్థానంలో చొప్పదండి, రెండో స్థానంలో హుజూరాబాద్, బాలికల విభాగంలో మొదటి స్థానంలో కరీంనగర్ అర్బన్, రెండో స్థానంలో హుజూరాబాద్ నిలిచాయియి. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక బహుమతలను ప్రదానం చేశారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సొల్లు సారయ్య, హెచ్ ఎంలు అనురాధ, శోభరాణి, తిరుమల, శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వేణు, పీడీ నర్సయ్య, అనిల్‌కుమార్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మండల నోడల్ అధికారులకు ఎంఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 24: మండల నోడల్ అధికా రులకు ఎంఈవోలుగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్నా ళ్ల ఎంఈవోలు లేక పోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువైంది. దీంతో మండల నోడల్ అధికారులకు మండల విద్యాధికారులుగా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ పాఠశాల విద్య ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 16 మంది నోడల్ అధికారులకు పూర్తిస్థాయిలో అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. మండ లాల వారీగా ఎంఈవోల వివరాలిలా ఉన్నాయి. ఎం మధుసూదనాచారి (మానకొండూర్), ఎ వేణుకుమార్ (రామడుగు), బి శ్రీనివాస్ (హుజూరాబాద్), ఎ ప్రభాకర్ రావు (గంగాధర), కె శ్రీనివాస్‌రెడ్డి (సైదాపూర్), వి శ్రీనివాస్ (తిమ్మాపూర్), అబ్దుల్ అజీమ్ (కొత్తపల్లి), కె రాములు (ఇల్లందకుంట), కె రామయ్య (గన్నేరువరం), ఎం లక్ష్మీనారాయణ (శంకరపట్నం), హేమలత (జమ్మికుంట), ఎస్ శోభరాణి (వీణవంక), కె రవీందర్ (కరీంనగర్ రూరల్), శ్రీనివాసదీక్షితులు (చొప్పదండి), వి పావని (చిగురు మామిడి), జి ప్రమోద (కరీంనగర్ అర్బన్).

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

● కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్యశిబిరం

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 24: నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిశుభ్రతకు కృషి చేస్తున్న నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కార్మికులకు సూచించారు. కార్మికులంతా వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకొని అవసరమైన చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన హెల్త్‌కార్డును గాంధీ జయంతి అక్టోబరు 2న పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్డుతో ప్రభుత్వ కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చని తెలిపారు. రెండు లక్షల హెల్త్ ఇన్సూరెన్సు కోసం నగరపాలక సంస్థ డబ్బులు చెల్లిస్తోందన్నారు.



కార్మికులకు పీపీ కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మహిళా కార్మికులు ఆరోగ్య మహిళా స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్మికుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా తమ పాలక వర్గం పని చేస్తుందని అన్నారు. అనంతరం కార్మికులకు పీపీ కిట్లను పంపిణీ చేశారు. కార్య క్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, పాలక వర్గ సభ్యులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

● సిటిజన్ చార్టర్ ప్రకారం సేవలందించాలి

సిటిజన్ చార్టర్ ప్రకారం నగర పౌరులకు అవసరమైన సేవలందించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని పౌరసేవా కేంద్రాన్ని ఆమె సందర్శించి ఈ కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సేవల్లో జాప్యం జరుగకుండా పౌరసేవా కేంద్రం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, కార్పొరేటర్ గందె మాధవి, జంగిలి ఐలేందర్ యాదవ్, చాడగొండ బుచ్చిరెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, నేతికుంట యాదయ్య, నక్క పద్మకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

తిమ్మాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యా ర్థులకు యూనిఫాం, షూస్, పౌష్టికాహారంతో పాటు అన్ని సౌకరాలు కల్పిస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. తిమ్మాపూర్ మోడల్ పాఠ శాలలో విద్యార్థులకు షూస్, సాక్స్‌లను కలెక్టర్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాల్లోని 22,318 మంది విద్యార్థులకు షూస్, సాక్స్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, డీపీవో రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, టూరిజం ఆఫీసర్, యూత్ కో ఆర్డినేటర్ రాంబాబు, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో మధుసూదన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థినికి బూట్లు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉపకరణాలు

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు తక్కువ ధరల్లో అందిస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధిత ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) భాగస్వామ్యంతో ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టవ్, ఫైవ్‌స్టార్ బీఎల్‌డీసీ, ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఎయిర్ కండిషనర్లు, ఎల్ఈడీ, ఇన్వర్టర్ బల్బులు అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు ముందుగా www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) వారి హోం పేజీలోకి వెళ్లాలన్నారు. అక్కడ అందుబాటులో ఉన్న విద్యుత్ ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులకు కావాల్సిన విద్యుత్ ఉపకరణాలను సులభతరంగా ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారలు కొనుగోలు చేసిన వస్తువులు వారి ఇంటికే డెలివర్ చేస్తామని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) పేజీలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అస్వస్థతకు గురైన వృద్ధుడిని బస్సులోంచి దింపేసిన కండక్టర్

● దిగిన వెంటనే ఆగిన ఊపిరి ● మృతుడిది కామారెడ్డి జిల్లా

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: అస్వస్థతకు గురైన వృద్ధుడిని ఆర్టీసీ బస్సులోంచి కండక్టర్ దింపేశాడు.. కొద్దిసేపటికే ఆ వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు వట్టిమల్ల ఎల్లయ్య(67) తన భార్య రాజవ్వతో కలిసి కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లేందుకు గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామం స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారు. కరీంనగర్ వరకు టిక్కెటు తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి వద్దకు బస్సు చేరుకోగానే వృద్ధుడు ఎల్లయ్య అస్వస్థతకు లోనయ్యాడు. కండక్టర్ ఆ దంపతులను ఇక్కడే హాస్పిటల్ ఉంది చూపించుకోమని బస్సు నుంచి కిందకు దింపేశాడు. వెంటనే ఎల్లయ్య కిందపడిపోగా అక్కడ ఉన్న యువకులు 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది చేరుకుని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వృద్ధుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారు. అస్వస్థతకు గురైన వృద్ధుడిపై మానవత్వం చూపాల్సిన ఆర్టీసీ బస్సు కండక్టర్ వృద్ధ దంపతులను బస్సు నుంచి కిందకు దింపేడయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆసుపత్రి ఉందని అక్కడి వరకు తీసుకెళ్లాలని ప్రాధేయపడినా కండక్టర్ పట్టించుకోలేదని మృతుడి భార్య రాజవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్టీసీ కండక్టర్ వ్యవహరించిన తీరుపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాజవ్వతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్థులు


గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 24: కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులకు వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామశివారులోని కేసీఆర్ నగర్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులకు వెళ్తుండగా గ్రామస్థులు అడ్డుకొని ధర్నాకు దిగారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం సిరిసిల్ల పట్టణ వాసులకు కేటాయించి నిర్వహణ మున్సిపల్‌కు ఉండేది. 15 రోజుల క్రితం కేసీఆర్ నగర్ నిర్వహణ చేపట్టలేమని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులు నిర్వహణ లేక చెత్తాచెదారం పేరుకుపోవడంతో కలెక్టర్ సందర్శించి గ్రామపంచాయతీకి నిర్వహణ అప్పగించారు. గ్రామస్థులు కేసీఆర్ నగర్‌ను మండపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయవద్దంటూ నిరసిస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో మంగళవారం మండెపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది కేసీఆర్ నగర్‌లో విధులు నిర్వహించడానికి వెళ్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్థులకు నచ్చ చెప్పడంతో అందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నగర్‌ను మండేపల్లి గ్రామపంచాయతీలో విలీనం చేస్తే ఒప్పుకునేది లేదని తెలిపారు.

క్రైం కార్నర్

మరో రూ.14లక్షలు దుర్వినియోగం

● అంజన్న ఉద్యోగిపై పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు

● గతంలో రూ.38లక్షలు.. కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 24 : కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలంల ఇన్‌చార్జీగా విధులు నిర్వహించి దేవస్థానం సొమ్ముల దుర్వినియోగానికి పాల్పడిన కె.శ్రీనివాసాచారిపై అధికారులు మంగళవారం మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.14 లక్షలు దేవస్థానం ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారిగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వ్యాపారులు చెల్లించిన 2023-24 సంవత్సర టెండర్లకు సంబంధించిన రూ.37.90 లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ గత ఫిబ్రవరిలో సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఈవో వెంకటేష్ ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసిన అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తాజాగా 2022-23 సంవత్సర ఖాతాలు పరిశీలించగా మరో రూ.14,49,900లక్షలు టెండర్‌దారుల చెల్లించిన సొమ్ములు దేవస్థానం ఖాతాలో జమ చేయనట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుత ఈవో రామకృష్ణరావు మంగళవారం శ్రీనివాసాచారిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగ శ్రీనివాసాచారిపై సస్పెన్షన్ పొడగిస్తూ దేవాదాయ శాఖ అదేశాలు జారీ చేసింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

● ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, సెప్టెంబరు 24 : ద్విచక్రవాహనాన్ని వెనుకాల నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన పత్తిపాక గంగాధర్ జగిత్యాల నుంచి బైక్ పై నుంచి మల్యాలకు వస్తుండగా నూకపల్లి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వెనుకాల నుంచి వచ్చిన బస్సు ఢీకొంది. దీంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలు అవడంతో పలువురు 108కి సమాచారం అందించగా అంబులెన్స్ ఈఎంటీ ఎస్.జ్యోతి, పైలట్ ఆంజనేయులు ప్రథమ చికిత్స అందజేశారు. గాయపడిన వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 24: మండలంలోని జాగీర్‌పల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 21క్వింటాళ్ల పీఈడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. జాగీర్‌పల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామానికి చెందిన చిన్న బత్తుల రాజయ్య అక్రమంగా ఓ ఇంట్లో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడని తెలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. బొమ్మల రామారం బోనగిరి గ్రామానికి చెందిన హేరావత్ మోతిలాల్ వద్ద ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 : మండలంలోని మహాత్మానగర్ రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన మాడిశెట్టి నర్సయ్య (55) సోమవారం రాత్రి అలుగునూర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నరసయ్య తన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో నరసయ్య తీవ్రంగా గాయ పడ్డాడు. ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారు జామున నరసయ్య మృతి చెందాడు. అతడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

● నర్సయ్య కళ్లు సజీవం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడిశెట్టి నర్సయ్య నేత్రాలను ఆయన కుమారుడు మాడిశెట్టి రాజేష్ దానం చేసినట్లు శాతవాహన లయన్స్ క్లబ్, కాళేశ్వరి లయన్స్ బాధ్యులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కంది జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్య పార్థివ దేహం నుంచి జత నేత్రాలను సేకరించి హైదారాబాద్‌లోని ఎల్ వీ ప్రసాద్ అసుపత్రికి పంపించామన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

రామడుగు, సెప్టెంబరు 24: మండలంలోని వెదిర పరిధిలోని వెంకటగిరికి చెందిన విజ్జగిరి శంకరయ్య (65) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలి పారు. శంకరయ్య మద్యానికి బానిస కావడం మూలంగా పక్షపాతానికి గురయ్యాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 19న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు విజ్జగిరి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో ఎల్లయ్య తెలిపారు.

వరట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24: వివాహం జరిగిన ఏడు నెలలకే అదనపు వరకట్నం వేధింపులతో కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన దొంత శ్రావణి(22) మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కట్టరాంపూర్‌లోని ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సిద్దిపేట మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన శ్రావణికి ఫిబ్రవరి 25న కట్టరాంపూర్‌కు చెందిన అజయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమ యంలో ఒప్పుకున్న వరకట్నం డబ్బులు, ఇతర లాంఛనాలు ముట్టజెప్పారు. అయినప్పటికీ అదనపు వరకట్నం తేవాలంటూ కొద్ది రోజుల నుంచి శ్రావణిని ఆమె భర్త అజయ్‌కుమార్, అత్త ఉపేంద్ర, మామ ఆంజనేయులు వేధింపులకు గురి చేస్తుండటంతో జీవితంపై విరక్తి చెందిన తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి సంగెం కొంరయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ముగ్గురిపై వరకట్నం వేధిం పుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు.

కాళేశ్వరం-మంథని-రామగిరి
సర్క్యూట్ అభివృద్ధికి చర్యలు

● దేవాలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి

● 2027లో జరిగే గోదావరినది పుష్కరాల నిర్వాహణకు చర్యలు

● దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్



వేద పండితులతో మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

మంథని, సెప్టెంబర్ 24: కాళేశ్వరం-మంథని-రామగిరి సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ వెల్లడించారు. మంగళవారం మంథనిలోని శ్రీమహాలక్ష్మి దేవాలయంలో దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరంలోని శ్రీగౌతమేశ్వర దేవాలయాన్ని పురావస్తుశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ సమీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం, మంథని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను సందర్శించామన్నారు. కాళేశ్వరం దేవాలయం లోపల, పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టే భక్తులకు అవసరమైన వసతులు ఏరకంగా కల్పించాలనే అంశంపై కాళేశ్వరంలో చర్చించామన్నారు. గోదావరినదిని ఏరకంగా శుభ్రం చేయాలి, పుణ్యస్నానాలు చేసేందుకు, షవర్స్, మహిళలకు స్నానాల గదుల ఏర్పాటు విషయాలను చర్చించామన్నారు. మంథనిలో ఆలయాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు, వచ్చే భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పన కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయాల అభివృద్ధికి రూపొందించే ప్రణాళికల్లో స్వల్ప, దీర్ఘకాలికంగా వేర్వేరుగా ఉండాలన్నారు. 2027 సంవత్సరంలో గోదావరినది పుష్కరాలు వస్తున్నాయని, వీటికి సంబంధించి ఘాట్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశ్వర ఆలయం వద్ద పుష్కరాల సందర్భంగా పార్కింగ్ స్థలం గుర్తించాలన్నారు. మంథనిలో ఆలయాలకు ఒక గుడి నుంచి మరో గుడికి హెరిటేజ్ వాకింగ్ చేసే విధంగా ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణ కోసం కళాభారతి లాంటి భవనం నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. మంథని పట్టణంలో ఆరు దేవాలయాలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. శ్రీసిలేశ్వర-సిద్ధేశ్వరాలయం పురావస్తుశాఖ పరిధిలో ఉంటుందన్నారు. శ్రీగౌతమేశ్వరాలయం వద్ద స్నానాల ఘాట్, షవర్లు, స్నాన గదుల ఏర్పాటు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. స్కంధ పురాణం ద్వారా శ్రీగౌతమేశ్వర ఆలయ పురాణం తెలుసుకొని, దీనికి సంబంధించి లైట్‌షో, వాటర్‌షో ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. శ్రీమహాలక్ష్మి ఆలయం సమీపంలోని చెరువులో అక్రమణలు తొలగించి పునరుద్ధరిస్తామని, చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రామగిరి ఖిల్లాను పర్యాటకశాఖ పరిధిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, పురావస్తు, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

● మృతికి తల్లే కారణమంటూ కులస్థులు దాడి ● ఆస్తి తండ్రి పేరు మీదకు మార్చాలని అంత్యక్రియలు నిలిపివేత

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 24 : మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అను యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంత దంపతులకు కుమారుడు ఏనుగు ప్రభాస్ ఉన్నాడు. ప్రతాప్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. గ్రామంలో ప్రభాస్ తన తల్లితో కలిసి ఉంటున్నాడు. ప్రభాస్ ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్మెంట్ చేద్దామని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు ఏదైనా జాబ్ చేయమని మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 8న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి తల్లి చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించగా వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ప్రభాస్ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈనెల 22న నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న ప్రభాస్ వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి మార్పిడి కోసం ఆగిన అంత్యక్రియలు

మృతికి తల్లె కారణమంటూ కులస్థులు దాడి..

చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రభాస్ అంత్యక్రియలు ఆస్తి మార్పిడి కోసం ఆగిపోవాల్సి వచ్చింది. ఇల్లరికం వచ్చిన ఏనుగు ప్రతాప్ 17 ఏళ్ల నుంచి గల్ఫ్ వెళ్లి సంపాదించిన ఆస్తి మొత్తం తన భార్య అనంత పేరు మీద ఉందని గ్రామస్థులు ఆరోపించారు. ఆ ఆస్తి మొత్తం ప్రతాప్ పేరున రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేయాలని అంత వరకు నిలపాలని బంధువులు మృతదేహాన్ని ఇంటి వద్దనే ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు ప్రభాస్ మృతికి తల్లి అనంత కారణమని గ్రామంలోని కులస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ప్రభాస్ మృతదేహంతో ఇంటికి వచ్చిన తల్లిపై గ్రామంలోని కులస్థులు దాడి చేశారు. గమనించి ఎస్సై చిరంజీవి ప్రభాస్ తల్లిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి అక్కడి చేరుకుని వారిని శాంతింపజేశారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా యువకుడు

రుద్రంగి, సెప్టెంబర్ 24 రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన మాలోత్ అనిల్ జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువతున్నాడు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీలో ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబరు 22న హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. యువకుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో బడితండా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాలలో ఆన్‌లైన్ మోసం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ మహిళ ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని పోచమ్మవాడ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకుని అధిక డబ్బులు వస్తాయనే ఆశతో రూ. 1.78 లక్షల పెట్టుబడి పెట్టింది. పెట్టుబడి పెట్టిన మరుసటి రోజే యాప్ కనబడకపోవడంతో మోసాపోయానని గ్రహించిన మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

'నవోదయ' దరఖాస్తుల గడువు పొడిగింపు

చొప్పదండి, సెప్టెంబరు 24: పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 8, 9 తేదీల్లో దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు 2024లో నిర్వహించిన పీజీ, రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎంఏ (ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎమ్మెస్‌డబ్ల్యూ) ఎమ్ఎస్‌ఈ(వృక్షశాస్త్రం, జువాలజీ, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్) ఎంసీఏ పరీక్షల ఫలితాలు శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయన్నారు.

28న యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఈ నెల 28 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఆయుష్‌శాఖ జిల్లా ఇంచార్జీ డాక్టర్ యస్రబ్‌సుల్తానా, డీపీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 90 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కరీంనగర్‌లో 15మంది పురుషులు, 15 మంది స్త్రీలు, పెద్దపల్లి 10 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, రాజన్నసిరిసిల్ల 8 మంది పురుషులు, 8 స్త్రీలు, జగిత్యాల 12 మంది పురుషులు, 12 మంది స్త్రీలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పురుషులు కనీసం 32 యోగా తరగతులు, స్త్రీలు 20 యోగా తరగతులకు హాజరుకావాలని సూచించారు. పురుష శిక్షకులకు ఒక తరగతికి రూ. 250 చొప్పున రూ. 8వేలు, స్త్రీలకు రూ. 5వేలు పారితోషికం ఇస్తారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతోపాటు కనీసం 6నెలల యోగా సర్టిఫికెట్ ఉండాలని, 45 సంవత్స రాలలోపు వయస్సు కలిగిన ఉండాలని, యోగా నైపుణ్యత ఉండాలని సూచించారు. ఈ పోస్టులు పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల ఆయుష్, ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

● 7 గేట్ల ద్వారా 21,868 క్యూసెక్కుల నీరు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లు మంగళవారం ప్రస్తుత సీజన్‌లో మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన 7వరద గేట్లను తెరిచి 21,868 క్యూసెక్కుల నీరును దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 45,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 45,858 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి స్పీల్‌వే ఆర్‌సీగేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నందున గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లరాదని, వలలు కొట్టుకుపోయే అవకాశం ఉన్నందున బయటకు తీసుకోవాలని, పశువుల కాపర్లు, సామన్య ప్రజలు ఎవరూ నదిలోకి దిగొద్దని, ప్రమాదానికి గురి కావద్దని అధికారులు కోరుతున్నారు.

కూతురికి అత్తింటి వేధింపులు..

● బావిలో దూకి తండ్రి బలవన్మరణం

● 9 గంటల పాటు కొనసాగిన గాలింపు చర్యలు

● లభ్యమైన మృతదేహం

● రాచర్లబొప్పాపూర్‌లో విషాదం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 : కుమార్తెకు న్యాయం జరగడం లేదని సోమవారం రాత్రి పాడుపడిన బావిలో దూకిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అగుళ్ల శ్రీనివాస్ (48) మృతదేహం మంగళవారం తెల్లవారుజామున లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అగుళ్ల స్వరూప-శ్రీనివాస్ దంపతులకు కూతురు రమ్య, కొడుకు రాజేశ్ ఉన్నారు. రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి ప్రశాంత్‌కు ఇచ్చి 10 ఏళ్ల కిందట పెళ్లి జరిపించారు. వారికి పదేళ్ల వయసు లోపు ఉన్న ఇద్దరు పిల్లలు రిషివర్ధన్, కీర్తన ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. భర్తతో పాటు అత్తింటి వారు రమ్యను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. మంచిగా చూసుకోవాలని మందలించినా మార్పు రాలేదు. దాంతో ఆరు రోజుల కిందట రమ్య అత్తింటిలో ఆత్మహత్యాప్రయత్నం చేసింది. విషయం తెలియడంతో తండ్రి శ్రీనివాస్ చేరుకుని చికిత్స చేయించి స్వగ్రామానికి తీసుకు వచ్చాడు. తన కూతురును అత్తింటి వారు వేధిస్తున్నారని పేర్కొంటూ ఈ నెల 21న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. న్యాయం జరగడం లేదని భావించిన శ్రీనివాస్ సోమవారం రాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వారి సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పంపి ఇంటి సమీపంలోని పాడుబడిన వ్యవసాయ బావిలో దూకాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. బావి చుట్టూ చెట్లు ఏపుగా ఉండడంతో గాలింపు కష్టతరంగా మారింది. బావిలో నీళ్లు అధికంగా ఉండడం వల్ల మోటార్‌ను తెప్పించి నీటిని తోడేసేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు తొమ్మిది గంటలపాటు గాలింపు కొనసాగింది. చివరకు శ్రీనివాస్ మృతదేహం లభ్యమవడంతో బయటకు వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిపై కేసు

అగుళ్ల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మృతుడి అల్లుడు మిట్టపల్లి శ్రీకాంత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు లక్ష్మీ, వీరస్వామి, సోదరుడు ప్రశాంత్, బంధువులు పద్మ, సతీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. శ్రీనివాస్ కూతురు రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌తో 10 ఏళ్ల కిందట పెళ్లి చేశారని పేర్కొన్నారు. కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 20న రమ్యను పుట్టింటి నుంచి అదనంగా ఐదు లక్షల రూపాయల కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్తమామలు, మరిది, బంధువులు వేధింపులకు దిగడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందని పేర్కొన్నారు. విషయం తెలిసిన తండ్రి శ్రీనివాస్ చేరుకుని ఆమెకు చికిత్స అందించి రాచర్లబొప్పాపూర్ గ్రామానికి తీసుకువచ్చాడని తెలిపారు. మృతుడు శ్రీనివాస్ కొడుకు రాజేశ్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.



బావి వద్ద ఎక్స్‌కవేటర్‌తో చెట్ల తొలగింపు

పిటీషన్ మేనేజ్‌మెంట్‌లో
గోదావరిఖని వన్‌టౌన్‌కు 4వ స్థానం

● రిసెప్షన్ ఆఫీసర్ వెంకట లక్ష్మి సేవలకు గుర్తింపు..

● సత్వర సేవల్లో బెల్లంపల్లి వన్‌టౌన్, ధర్మారం ఠాణాల ఎంపిక



ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్



. కానిస్టేబుల్ వెంకటలక్ష్మి

కోల్‌సిటీ, సెప్టెంబరు 24 : పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేయగా, గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు 4వ స్థానం లభించింది. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కానిస్టేబుల్ వెంకటలక్ష్మి స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను తెలుసుకుని అధికారుల వద్దకు తీసుకవెళ్లేవారు. వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రశీదు కూడా అప్పగిస్తున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు ఆమెకు గుర్తింపు లభించింది. ఠాణా కూడా ఎంపికైంది. అలాగే సత్వర సేవల విభాగంలో బెల్లంపల్లి వన్‌టౌన్‌కు 3వ స్థానం, ధర్మారం పోలీస్ స్టేషన్‌కు 5వ స్థానం లభించాయి. బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్‌లు ఠాణాలకు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, వారికి పోలీసులపై నమ్మకం కలిగించారని సీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలందిస్తున్న విభాగాల్లో పది ఠాణాలను ఎంపిక చేయగా బెల్లంపల్లి ధర్మారం, ఠాణాలకు స్థానం దక్కింది.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం



ధర్మారంలో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంటను చూపిస్తున్న రైతు

కోనరావుపేట, సెప్టెంబరు 24: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామశివారులో అడవి పందుల దాడిలో వరి పంట మంగళవారం ధ్వంసం అయింది. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్, బొడ్డు ప్రవీణ్, మల్లవేని తిరుపతి అనే రైతులకు చెందిన వరి పొలంను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో వరి పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ చేయాలంటూ రైతువేదికకు తాళం

ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపిన రైతులు



రైతువేదికకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24 : రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం రైతులు ఇబ్రహీంపట్నం రైతువేదిక కార్యాలయానికి తాళంవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ, రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 రోజున 2లక్షల రుణమాఫీ చేస్తా అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చేయలేదన్నారు. వానాదకాలం సీజన్ ముగిసిన ఇప్పటి వరకు రైతుబంధు రాలేదని ఇప్పటికైన ప్రభు త్వం కళ్లు తెరిచి రుణమాఫీ, రైతు బంధు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏలేటి చిన్నారెడ్డి, నాంపల్లి రమేష్, కల్లెం చిన్న సాయన్న, బాస జలంధర్, తీగల రవీంధర్‌రెడ్డి, బద్దం సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన రాహిత్యంతోనే అమృత్ టెండర్లపై ఆరోపణ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 24: మాజీ మంత్రి కేటీఆర్ ఒక అబద్ధాల కోరు అని, అవగాహన రాహిత్యంతోనే అమృత్ టెండర్లపై ఆరోపణలు గుప్పిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలోనే బీఆర్‌ఎస్ నేతలకు మించిన అవినీతి పరులు ఎవరూ లేరని అన్నారు. ఇష్టారాజ్యంగా ప్రాజెక్టుల అంచనాలు పెంచారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్లలో అక్రమాలు జరగాయని సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాస్తవాలను తప్పుదోవ పట్టిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బి) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. నీటి పారుదల శాఖ అధికారులు చొప్పదండి మండలం బ్రాహ్మణికుంటను సందర్శించారని తెలిపారు. బ్రాహ్మణ కుంటను కబ్జాను చేయడానికి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ చెరువు శిఖంలోనే నిర్ణయించి రెవెన్యూ అధికారులకు తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. గతంలో చేసిన తప్పునే మరోసారి చేస్తున్నారని పేర్కొన్నారు. బ్రాహ్మణ కుంటను కబ్జాచేసిన వారితో కలిసి అధికారులు సందర్శించడమేమిటని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు ఎవరికి చెప్పకుండా సందర్శించడమేమిటని ప్రశ్నించారు.

నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 24: నగరంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, ఏడీఈ, సాయినేని నరేందర్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు మెహర్‌నగర్,వరలక్ష్మినగర్, మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు సీతారాంపూర్, సాయిరాంనగర్, తులసీనగర్, రెడ్డి ఫంక్షనల్ హాల్ వెనుక వైపు ప్రాంతం, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా : సుడా చైర్మన్



కాలనీవాసులతో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 24: మల్కాపూర్‌లోని శ్రీలక్ష్మి హోమ్స్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం లక్ష్మీ హోమ్స్ కాలనీవాసులు సుడా కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాలనీవాసులతో కలిసి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హోమ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాపూర్ మెయిన్ రోడ్డులో మురికి కాలువలు లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని సమస్య నుపరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సుడా డీఈ రాజేంద్రప్రసాద్, ఏఈ రమేష్, మల్కాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న మల్టీపర్పస్ పార్కు పనులు

- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 24: నగర నడిబొడ్డున తెలంగాణచౌక్‌లో అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న మల్టీపర్పస్ పార్కు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం ఆయన పార్కును సందర్శించి నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, ఆర్వీ, విద్యుత్‌శాఖ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్‌తో కలిసి పనులను పరిశీలించారు. అక్టోబర్‌లో పార్కును ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగర ప్రజలతోపాటు జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు పచ్చదనంలో సేదతీరేలా అందమైన ల్యాండ్ స్కేపింగ్, మనసుకు హాయినిచ్చే వివిధ రకాల ఆకర్షణీయమైన పూల మొక్కలు, ఆకట్టుకునే చక్కటి మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్, ఆంఫీ థియేటర్, చిన్నారుల కోసం ఆట పరికరాలు, వాకర్ల కోసం ఈపీడీఎం వాకింగ్ ట్రాక్, గజిబోలు, బెంచులు అన్ని రకాల వసతులను ఈ పార్కులో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, గందె మాధవి మహేశ్, జంగిలి ఐలేందర్ యాదవ్, దిండిగాల మహేశ్, సల్ల శారద రవీందర్, తుల శ్రీదేవి చంద్రమౌళి, నాగ సముద్రం ప్రవీణ్, డీఈ అయూబ్‌ఖాన్, ఏఈ గఫూర్, ఎస్పీ డీసీఎల్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 24: మండలంతోపాటు పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సిఎమ్‌ఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడు ముందుంటానని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారందరికి మెరుగైన చికిత్స అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులు బీమా చేయించుకోవాలి

జమ్మికుంట, సెప్టెంబరు 24: వీధి వ్యాపారులు బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ మాట్లాడుతూ వీధి వ్యాపారులందరికి రుణాలు అందించాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే విధంగా చూడాలన్నారు. సమావేశంలో మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మానస, బ్యాంకుల మేనేజర్లు, సిఎల్ ఆర్పీలు, ఆర్పీలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'లో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై శిక్షణ

తిమ్మాపూర్, సెప్టెంబరు 24: మండలకేంద్రంలోని జ్యోతిష్మతి కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై 120 గంటల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించినట్లు విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు తెలిపారు. పరిశ్రమల్లో ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే దిశగా ఈ శిక్షణ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, మిషన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎడ్యునెట్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ సుమిత్ సునీల్ సర్దాలే విద్యార్థులకు ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమీత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ పీకే వైశాలి, విభాగాధిపతి జగదీషన్ పాల్గొన్నారు.

ఎస్టీల్లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకి రాజు

హుజూరాబాద్, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల్లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకి రాజు డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లో జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలన్నారు. తెలంగాణలో ఎస్టీల వర్గీకరణ చేపట్టే ముందు విద్యా, ఉద్యోగ, ఉపాధి, సామాజిక రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందని తెగలను గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కూతాడి శ్రీనివాస్, కోనేటి రాజు, రేవెల్లి రాజలింగం, కూతాడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న శాతవాహన రిజిస్ట్రార్



మొక్క నాటుతున్న అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 24: జాతీయ సేవా పథకం సెల్ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఆవరణలో వలంటీర్లు స్వచ్ఛభారత్ నిర్వహించి సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ని సేకరించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో రిజిస్ట్రార్ ఆచార్య యం. వరప్రసాద్ మాట్లాడుతూ దేశసేవలో ఎన్‌సీసీ వలంటీర్లు ముందుంటారని అన్నారు. కార్యక్రమ అధ్యక్షులు, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ వలంటీర్లు సామాజిక సేవలో ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జాఫర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరికాంత్, ఆచార్య సూరేపల్లి సుజాత, యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

● కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్, అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో స్వచ్ఛతహీసేవా కార్యక్రమం, ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వానికేతన్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావం సందర్భంగా వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య ప్రోగ్రాం ఆఫీసర్ బి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.నిర్మల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు.

● **హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/వీణవంక/గంగాధర:** హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీవల నిర్వహించిన మట్టి వినాయకుడి విగ్రహాల తయారీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వీఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో అధ్యాపకులు, వలంటీర్లు పిచ్చి మొక్కలను తొలగించారు.

అల్ఫోర్స్, అక్షయ డిగ్రీ కళాశాలలో..

భగత్‌నగర్: నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, అక్షయ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా (ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సేవా పథకం ప్రారంభించి 55 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. జాతీయ సేవా పథకం ద్వారా కళాశాల విద్యార్థులను సేవా దృక్పథం పెంపొందించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి సంవత్సరం ఒక గ్రామాన్ని ఎంపికచేసుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు చేపట్టాలి : సీపీఎం

భగత్‌నగర్, సెప్టెంబరు 24: ప్రజా పోరాటాలతోనే పార్టీని బలోపేతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని మంకమ్మతోట కార్యాలయంలో సీపీఎం యువజన శాఖ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటుచేసి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. నూతన శాఖకార్యదర్శిగా ఎంరఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నరేష్‌పటేల్, అకల్‌సింగ్, ఆకాష్, అజయ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 24: పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని పలు డివిజన్‌లలో మంగళవారం సభ్యత్వ నమోదుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 25వ తేదీ బుధవారం రోజున మెంబర్‌షిప్ డ్రైవ్ చేయాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వాసుదేవరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ తదితరులు పాల్గొన్నా రు. నగరంలోని 17వ డివిజన్‌లో బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు పోతు జగదీష్, శక్తి కేంద్ర ప్రముఖ్ నరహరి లక్ష్మారెడ్డి, సహ ప్రముఖ్ ఖచ్చు మధు, కుదురు రవి, రవికుమార్ పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్లకు అవార్డులు



బెస్ట్ టీచర్స్ అవార్డు పొందిన ప్రైవేట్ టీచర్లతో ట్రస్మా బాధ్యులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 24: నగరంలోని పద్మనాయక కల్యాణమండపంలో ట్రస్మా ఆధ్వర్యంలో మంగళవారం ప్రైవేటు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్స్ అవార్డులు అందించారు. కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు హాజరై మాట్లాడారు. విద్యా బోధనలో బడ్జెట్ పాఠశాలలు నిరంతరం కృషిచేస్తున్నాయని అన్నారు. ఎలాంటి ఆధారం లేని అనేకమంది గ్రాడ్యుయేట్స్‌ని ఉపాధికల్పించడంలో ప్రైవేట్ పాఠశాలలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రైవేటు టీచర్లకు హెల్త్‌కార్డులతో పాటు హెల్త్ ఇన్సూరెన్సు 10 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం సంరక్షణ చట్టం చేయాలని కోరారు. ఆల్ ఇండియా ప్రిన్సిపల్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ సెక్రటరీ డాక్టర్ ఎ.జోష్ణరావు మాట్లాడుతూ విలువలు, క్రమ శిక్షణతో కూడిన విద్యనందిస్తూ ప్రైవేట్ పాఠశాలలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, ట్రస్మా వివిధ జిల్లాల బాధ్యులు ముసుకు తిరుపతిరెడ్డి, కేశవరెడ్డి, శ్రీధర్, సిద్ధయ్య, సుభాష్మామ, సురేందర్, కార్యదర్శులు, కరస్పాండెంట్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నా.. ఆశీర్వదించండి : శేఖర్‌రావు

కార్యక్రమంలో అంతకు ముందు ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ విద్యారంగంలో రెండు దశాబ్దాలకుపైగా అనుభవం కలిగి ట్రస్మా వ్యవస్థాపక సభ్యుడిగా ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు, సంక్షేమానికి, పాఠశాలల బలోపేతానికి, ప్రభుత్వ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వివిధ సమస్యలపై జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లి కృషిచేసిన నాయకుడిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని ఆశీర్వదించి చట్టసభలకు పంపిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

విజయ దశమిని వైభవంగా నిర్వహిస్తాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, సెప్టెంబరు 24: విజయ దశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మహాత్మానగర్ ఎల్‌ఎండీ కాలనీలోని రాంలీల మైదానంలో నిర్వహించనున్న విజయ దశమి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈసారి వివిధ శాఖల ఉద్యోగులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించేందుకు ఉత్సవ కమిటీకి బాధ్యతలు అప్పగించామన్నారు. ఉత్సవ కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్‌గా కుంట రాజేందర్‌రెడ్డి, కోకన్వీనర్‌గా గవ్వ రాజేందర్‌రెడ్డి, సభ్యులుగా కేతిరెడ్డి ఎల్లారెడ్డి, గూడ కమలాకర్, గవ్వ రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, గోపు మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, కాలువ మల్లేశం, పోలు రాము, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, పోలు రమేష్, నోముల అనిల్, ఊట్కూరి వెంకట రమణారెడ్డి, బుధారపు శ్రీనివాస్, సిరిగిరి కొండల్ రావు, ఇనుకొండ వీరా చంద్రారెడ్డి పాల్గొన్నారు.

● **రూ. 10వేల ఆర్థిక సహాయం**

మానకొండూర్: మానకొండూర్ గ్రామానికి చెందిన కొండ్ర ప్రహర్ష (24) అనే వివాహిత వ్యవసాయబావిలో దూకి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రహర్ష కుటుంబసభ్యులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జడల రమేశ్, మండల యూత్ అధ్యక్షుడు కొండ్ర సురేష్ ఉన్నారు.

'ఆలయ నిర్మాణానికి సహకరించాలి'

శంకరపట్నం, సెప్టెంబరు 24: మండలంలో కొత్తగట్టులో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కొత్తగట్టు ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగట్టు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో పెద్దమ్మతల్లి దేవాలయం, పక్కన ఉన్న ఖాళీ స్థలం పోతుందన్నారు. దానికి నేషనల్ హైవే వారు స్లాబ్ వరకే నష్టపరిహారం చెల్లిస్తున్నారనిని తెలిపారు. విగ్రహాలకు కూడా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. పెద్దమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణానికి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, నిర్మాణం పూర్తయ్యే వరకు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లికి ముదిరాజ్ సంఘం సభ్యులు కోరారు.

28న జాతీయ లోక్ అదాలత్

హుజూరాబాద్, సెప్టెంబరు 24: హుజూరాబాద్ కోర్టు భవనంలో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్ కేసులు, ఎక్సైజ్, ప్రమాదబీమా, కుటుంబ వివాదాలు, కార్మిక, విద్యుత్ తదితర కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు.

● చిగురుమామిడి: జిల్లా కోర్టులో ఈ నెల 28న నిర్వహించే లోక్ అదాలత్‌లో వివిధ కేసులు రాజీ చేసుకోవచ్చని ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్, కొట్టుకున్న, చీటింగ్, వివాహ బంధానికి సంబంధించిన కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సూచించారు. కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు కోర్టు సిబ్బందిని కలవాలన్నారు.

రేషనలైజేషన్ నిబంధనలు మార్చాలి

రామడుగు, సెప్టెంబరు 24: అశాస్త్రీయంగా ఉన్న రేషనలైజేషన్ నిబంధనలు మార్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రచార్యులు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం 25 జీవోను జారీ చేసిందన్నారు. ఈ జీవోను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటిని తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి సాన కిషన్, నమస్తే ఉపాధ్యాయ కన్వీనర్ వెలిచాల వెంకటస్వామి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కుమార్, జిల్లా నాయకులు కోట సమ్మయ్య, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జీవో నంబరు 25ను తక్షణమే రద్దు చేయాలని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధించాలనే జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతేపెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

బ్రాహ్మణ కుంట శిఖం భూమి పరిశీలన



శిఖం భూమిని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

చొప్పదండి, సెప్టెంబ రు 24: పట్టణంలోని బ్రాహ్మణ కుంట శిఖం భూమిని నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. శిఖం భూమికి సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను సర్వే చేసి ఉన్నత అధికారులకు నివేదికను అందజేస్తామ ని తెలిపారు. శిఖం భూమిలో ఎలాంటి కట్టడాలు నిర్మించవద్దని వారు తెలిపారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ సుదాకిరణ్, డీఈ రూప్లానాయక్ పాల్గొన్నారు.

నేడు పూజా సామగ్రి అమ్మకానికి వేలం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 24: దేవాదాయశాఖ పరిధిలోని భగత్‌నగర్, జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలో గల వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల్లో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్కు కోసం బుధవారం ఉదయం 10-30 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికుల పాల్గొనాలని కోరారు.

సంక్షేమ బోర్డు సాధనకు పోరాటం

భగత్‌నగర్, సెప్టెంబరు 24: సంక్షేమ బోర్డు సాధన, భారతీయ న్యాయ సహిత చట్టం రద్దుకు పోరాటం చేయాలని పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి అన్నారు. ఆటో సంఘర్షణ యాత్ర కరీంనగర్ చేరుకున్న సందర్భంగా ఆటో అడ్డా వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఫ్రీబస్ వల్ల ఉపాధి కోల్పోయిన ఆటోం, టాటా ఏసీ క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఈ నెల 27న కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, నాయకులు వీరస్వామి, అమీర్, ఆటో అడ్డా డ్రైవర్లు మల్లేశం, సంతోష్, తిరుపతి, కుమార్, రమేష్, సంపత్, శ్రీనివాస్, మధుసూదన్, రాజేశం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24: వరంగల్‌లో ఈ నెల 26 నుంచి నిర్వహించే 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పలు విభాగాలలో క్రీడాకారులను ఎంపిక చేశారు. పాఠశాలల అండర్-14 బాలుర విభాగంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(సప్తగిరికాలనీ)లో 6వ తరగతి చదువుతున్న మహమ్మద్ రేయాన్ 50కిలోలపై విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు అంతటి శంకరయ్య తెలిపారు. రేయాన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముల్కూరి రాజేందర్, కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాషవేణి వేణుగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సెయింట్ జార్జ్ పాఠశాలలో వైద్య పరీక్షలు

భగత్‌నగర్, సెప్టెంబరు 24: నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) పాఠశాలలో సూర్య చెస్ట్ ఆసుపత్రి వైద్య బృందం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

చిన్నారికి అభినందన

భగత్‌నగర్, సెప్టెంబరు 24: ఖురాన్ చదివిన చిన్నారి జిక్రా ఫాతిమాను మదార్సా అరబియా ఖురాన్ ప్రిన్సిపాల్ ముఫ్తి మహ్మద్ ఫియాస్ మొహి యుద్దీన్ అభినందించారు. ఆదిలాబాద్ జిల్లా జన్నారంకు చెందిన హఫీజ్ షేక్ అహ్మద్ హిఫ్జీ కూతురు జిక్రా ఫాతిమా ఖురాన్ షరీఫ్ పూర్తి చేయడంతో పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

27న విద్యార్థి గర్జన సభ

భగత్‌నగర్, సెప్టెంబరు 24: ఈనెల 27వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాకార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం నగరంలోని మొకమ్మతోటలో కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి గర్జనసభ పోస్టర్‌ను అవష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎవినయ్, తిప్పారపు రోహిత్, నాయకులు అక్షయ్, చందు ఉన్నారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24: కరీంనగర్ ప్రగతి నగర్ ప్రాంతంలో పిట్టల ప్రశాంత్‌కు చెందిన ఇంటిలో వెనుకవైపు డోర్ నుంచి గుర్తుతెలియని దొంగలు చొరబడి కప్‌బోర్డులోని 184 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి యజమాని భార్య లహరి ఇంటికి తాళంవేసి మరో మహిళతో కలిసి షాపింగ్‌కు వెళ్లి వచ్చి చూడగా వెనుక డోర్ గడియతీసి ఉంది. అనుమానం వచ్చి లోపలికివెళ్లిచూడగా బంగారు ఆభరణాలు కనపడలేదు. బంగారు ఆభరణాల విలువ 4 లక్షల 67 వేల 500 రూపాయలుంటుందని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

● సంక్షిప్త సమాచారం..

●హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దెలో మహిళా మాతృశక్తి ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించారు.

-మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌వైకే- రాజాపల్లి యువశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమం నిర్వహించారు.

- పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ అసెస్మెంట్ బృందం సభ్యులు పరిశీలించారు.

● సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.

● తిమ్మాపూర్: వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా స్వచ్ఛతాహీసేవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ గంధ్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

● మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో గీతాకార్మికుల సభ్యత్వ నమోదు నిర్వహించారు.

● గన్నేరువరం: మండల కేంద్రం నుంచి పొత్తూరుకు వెళ్ళే దారి గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనదారుల ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి సొంత ఖర్చులతో ట్రాక్టర్ ద్వారా మట్టిని పోయించి గుంతలను పూడ్చివేశారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా సేవలందించి బదిలీపై వెళ్తున్న లక్ష్మిని గ్రామ యువకులు కొలిపాక కమలాకర్ ఆధ్వర్యంలో సన్మానించారు.

- మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన ఏముండ్ల లింగయ్య అనే వృద్ధుడు ఈ నెల 19 నుంచి కనబడటం లేదని ఆయన కుమారుడు రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అచూకీ తెలిసినవారు ఫోన్: 9949462587కు సమాచారం అందించాలన్నారు.

● చొప్పదండి: పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన మున్సిపల్ కార్మికుడు కల్లెపల్లి అశోక్ అనారోగ్యంతో మృతి చెందాడు. వార్డు కౌన్సిలర్ గంగరాజు అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

● గంగాధర: మండలంంలోని తాడిజెర్రిలో మహిళలకు బోనాల కోలాట శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది.

- గ్రామాల్లో పారిశద్యంపై నిర్లక్ష్యం చేయవద్దని ఇన్‌చార్జి డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌లో పారిశుధ్య పనులు పరిశీలించారు.